

# లోగుట్టు పెరుమాళ్ళకెరుక

ఎల్. ఆర్. స్వామి

**హఠాత్తుగా ఏడుపు తారాస్థాయిని చేరుకుంది.**

**ఉదాసీనంగా వసారాలో కూర్చుని పొగపీల్చే నేను తుళ్ళిపడి లేచాను. సిగరెట్టు నులిపి దూరంగా విసిరేసి లోపలకు వెళ్ళాను.**

"ఇలా జరుగుతుందని అనుకోలేదే అమ్మా" శవం మీద పడి గుండెలు బాదుకొని ఏడుస్తోంది, జుట్టు నెరసిన ఒక ఆవిడ. నాకిలా అన్యాయం చేస్తావని కలలో కూడా అనుకోలేదే" దుఃఖమాపుకోలేక వెక్కి వెక్కి ఏడ్చింది ఆమె.

ఏడుస్తున్నది లలిత. మాట వరసకు నేను 'పెద్దమ్మా' అని పిలిచే మా పొరుగింటావిడకి - అదే చనిపోయిన ఆవిడకి - కూతురు.

ముందుకు వెళ్ళి లలితని ఓదార్చాలని అనుకున్నాను. కానీ నేను కన్నీరు ఆపుకోలేకపోయాను. ఎవరైనా ఏడుస్తూ కనబడినా, గుండెలను పిండే విధంగా మాట్లాడినా, నా హృదయం కరిగిపోతుంది. కన్నీరు జాలువారుతుంది. అది నా బలహీనత.

అక్కడ నిలబడలేకపోయాను. కర్చీఫ్‌తో కళ్ళు ఒత్తుకుంటూ బయటకు వచ్చాను.

పగలు చచ్చిపోయి వుంది. పగటి శవాన్ని చూడటం కోసం వచ్చేవారు గురించి పశ్చిమాంబర ప్రాంగణంలో ఎర్రమబ్బుల షామియానా వేసి వుంది. పరామర్శ కోసం వచ్చిన చుట్టాలలాంటి నక్షత్రాలు మెలమెల్లిగా షామియానా కింద చేరుతున్నాయి.

"అదృష్టవంతురాలు షామియానా కింద చేరిన వారిలో ఒకతను అన్నాడు 'నిండు నూరేళ్ళూ బ్రతికింది'.

"అదృష్టమేమిటి నా బొంద" మరొకడికి ఆ మాటలు నచ్చలేదు. "నూరేళ్ళు బ్రతికి ఏం సాధించిందట? ఏం అనుభవించిందట? శారీరకంగానూ, మానసికంగానూ అనుభవించిన నరకం తప్ప"

"అలా అంటే నేనొప్పుకోను. నువ్వేంటి చూశావు, ఆవిడ దర్జా, ఆవిడ మహారాణిలా బ్రతకటం నేను చూశా"

నిజమే! పెద్దమ్మ బాగా బ్రతికిన రోజులు నాకు గుర్తే. మా చిన్నప్పుడు మడత నలగని పట్టుచీర కట్టి, వంటినిండా నగలు దిగేసుకొని బయటకు వచ్చే పెద్దమ్మను చూసి మాలాంటి పిల్లలే కాదు, పెద్దవాళ్ళు కూడా అలా చూస్తూ నిలబడిపోయేవారు. ఏ ఇంటికైనా పెళ్ళికి కానీ, పేరంటానికి కానీ పెద్దమ్మ వెళితే ఆడవాళ్ళంతా లేచి నిలబడి ఆమెని గౌరవించేవారు. అంతే కాదు, ఇద్దరాడవాళ్ళు కలిస్తే పెద్దమ్మ గురించే మాట్లాడుకునేవారు.

"ఐనా ఆవిడ బ్రతుకేమైనా మన బ్రతుకలా అణా, కానీ బ్రతుకా?" మా యింటికి వచ్చిన మేనత్తతో మా అమ్మ చెప్పిన మాటలు నాకింకా గుర్తున్నాయి. "అదృష్టవంతురాలు పెట్టి పుట్టింది" అమ్మ గొంతులో కొంత నిరుత్సాహం స్ఫురించింది. "మొగుడు రెండు చేతులతోనూ సంపాదిస్తున్నాడు. పైగా ఆశగా, ఆప్యాయంగా చూసుకుంటున్నాడు. అంతకన్నా ఏంకావాలి?"

"నిజమేనండీ అమ్మగోరు! "మా ఇంటి పనిమనిషి కొండమ్మ వంత పాడింది. "ఆ ఇంటిలోని సామాన్లకు, ఆ ఇల్లే సరిపోదమ్మగోరు. అయినా అమ్మ చాలా మంచిది. అస్సలు పొగరు లేదు. పనివాళ్ళంటే ప్రాణం పెడతారనుకోండి"

"అక్కడ కూడా చేస్తున్నావనేగా నువ్వప్పుడప్పుడూ బుర్ర ఎగరేస్తూ వుంటావు" అమ్మ కోపంగా అంది. "నమ్మకంగా వుండేవాళ్ళకి ఆవిడ ప్రాణమైనా యిస్తారని మాకు తెలుసులే. నువ్వు చెప్పక్కరలేదు"

ఏడుపు మళ్ళీ తారస్థాయిని అందుకోవటం వల్ల నేను మరోసారి తుళ్ళిపడ్డాను. తల్లి తనకు అన్యాయం చేసి వెళ్ళిపోయిందని నెత్తీ నోరూ బాదుకొని ఏడుస్తోంది అరువది సంవత్సరాల లలిత.

లేచి దూరంగా నడిచాను. షామియానా చివర వున్న ఒక కుర్చీలో కూలబడి సిగరెట్టు వెలిగించాను. సుడులు తిరిగే సిగరెట్టు పొగ లాంటి ఆలోచనలు నన్ను చుట్టుముట్టాయి.

"ఎప్పుడు జరిగిందిరా" తుళ్ళిపడ్డాను నేను. నా భుజం మీద చెయ్యి వేసి నిలబడి వున్నాడు నా మిత్రుడు ప్రసాద్.

"ఎప్పుడు పోయిందిరా అవిడ?" ప్రసాద్ మళ్ళీ అడిగాడు.

"మూడు గంటలప్పుడు"

"సుబ్బయ్యకు ఫోన్ చేశావా?" ప్రసాద్ అడిగాడు. సుబ్బయ్య మా స్నేహితుడు పోయిన పెద్దమ్మకి సొంత కొడుకు.

"చేశానురా! గోదావరిలో బయలుదేరు తాడట"

"అలాగా మిగతా ఏర్పాట్లు అన్నీ చేశావా? పోయిన ఆవిడకి కొడుకూ కూతురూ వున్నారనే మాటేగానీ ఆవిడ బాధ్యత అంతా నీదేగా"

నిజమే! పోయిన ఆవిడ గురించి నేనే చూడాలి "పెద్దమ్మా" అని ఆవిడను పిలుస్తున్నాను. కానీ ఆవిడ నాకు చుట్టం కాదు. పొరుగింటావిడ. నా చిన్నప్పటి నుంచీ ఆవిడని "పెద్దమ్మా" అని పిలవటం అలవాటు అయిపోయింది. ఆమె పిల్లలు, నేను కలిసి ఇసుక గూళ్ళు కట్టుకొని ఆడుకొనే రోజుల నుంచీ అదే అలవాటు.

"అడగటం మర్చిపోయానురా" ప్రసాద్ అడిగాడు "లలిత ఇంకా రాలేదా ఏంటి?"

"వచ్చిందిలే ఆ ఏడుపు వినబడటంలా, నాకన్యాయం చేసి వెళ్ళావమ్మా అని"

"మొత్తానికి వచ్చిందన్నమాట" ప్రసాద్ ఆ మాట నొక్కి పలికాడు. ఆ మాటలలోని అంతరార్థం నాకు అర్థమైంది.

ఊరిలోనే వుంటుంది లలిత. ఐనా మంచం పట్టిన తల్లిని పలకరించటానికి వచ్చేది కాదు. ఇంచుమించు ప్రతిరోజు ఫోన్ చేస్తూనే వున్నాను నేను. ఒకసారైతే కూతురిని చూడలేదని కుంగిపోతున్న పెద్దమ్మని చూడలేక నేనూ, ప్రసాదు కలిసి లలిత ఇంటికి వెళ్ళాము కూడా.

"పెద్దమ్మ నువ్వు రాలేదని బాధపడు తోందక్కా" నేను అన్నాను. పుట్టినప్పటి నుంచీ ఇరుగు పొరుగులుగా బ్రతికాము. కనుక

## స్వగతం



సగం చంద్రుడు ఆకాశంలో
దేవుని చెవిలా వ్రేలాడుతూ
వింటున్నాడు నా స్వగతం..
నిన్న కళకళలాడిన నా జేబు
నిండుకుంది రాత్రి 'సారా'ంశంతో
షైకంలో కారు కీ ఎక్కడో జారుకుంది
అయితే నా శ్రీమతి హ్యాండ్ బాగ్‌లో
స్పేర్ వుందన్న ధైర్యం వచ్చింది
అందమైన నా శ్రీమతికి
ప్రకృతి పరిశీలనంటే పరవశం
'పామ్' స్ప్రింగ్స్‌కు పోదాం
అవి అదృష్టానికి ఆలవాలం
'స్మోకీ' పర్వతాలు చూద్దాం
అవి ఫైర్ ఫైటర్స్‌లా నిలుస్తాయి
స్టోన్ పర్వతం చూసొద్దాం
జాతకాలు మార్చేసే రంగురాళ్ళయినా
దొరుకుతాయి అంటుంది...
అయితే కాలం వక్రించింది
నా గడియారాల కంపెనీ వైండ్
అయిన రోజునే
నా ఐస్‌క్రీమ్ కంపెనీ లిక్విడేట్
అయింది
చిన్నసైజు పేపరు మిల్లు కాస్తా
ఫోల్డ్ అయి కూర్చుంది
షేర్ మార్కెట్‌లో షేర్లు కాస్తా
హుషారు తగ్గిన నర్తకిలా
ఉసూరుమన్నాయ్
నాకింకేమిటి దారి?
పుల్లలకొట్టు బుగ్గయితే
బొగ్గుల కొట్టుగా నిలుస్తుంది
ఎం.పి.గా టికెట్ రాకపోతే
రాజ్యసభకన్నా అవకాశం వస్తుంది
నమ్ముకున్న వ్యాపారాలు నట్టేట
మునిగితే
చేయూతనిచ్చేదెవరు?
చేరదీసేదెవరు?
చేతులు మారిన డబ్బు
చేతికి రాకుంటే జబ్బు
సంపదలున్నప్పుడు సహధర్మచారిణి
ఆపదలొస్తే అంటీ అంటని అలివేణి
ఇదే నేటి సామాజిక నీతి
ఇదే ఈనాటి 'మనుస్మృతి'

– గాయత్రి


**పుస్తకాలు**

**అమెరికా తెలుగు కథానిక**

**సంపాదకులు : డా॥ పెమ్మరాజు వేణుగోపాలరావు, డా॥ వంగూరి చిట్టెన్ రాజు**

*ప్రచురణ:* వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, హోస్టన్, టెక్సాస్.

*ప్రతులకు :* అన్ని విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని కేంద్రాల్లో, నవోదయా బుక్ హౌస్, వాహినీ బుక్ హౌస్‌లలోను లభ్యం.




ఈ సంకలనంలో ప్రవాసాంధ్రులుగా అమెరికాలో స్థిరపడినవారు రాసిన 29 కథలు వున్నాయి. ఇందులో 9 కథలు అమెరికా తెలుగు అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా నిర్వహించిన పోటీల్లో బహుమతులు అందుకున్నాయి. గత నాలుగు ఐదు దశాబ్దాలుగా అమెరికాలో వున్న తెలుగు మీద ప్రత్యేకమైన అభిమానంతో రచనలు సాగించే అమెరికాలోని ప్రవాసాంధ్ర తెలుగు కథా రచయితలు ఎంతో అభినందనీయులు.

ఈ కథలు అమెరికాలోని 'ఆరాటాలని' 'అంతర్మథనాలనీ' ఎంతగానో ప్రతిబింబిస్తున్నాయి. 'ఇమిగ్రెంట్ తెలుగు ఇంటలెక్చువల్స్'లోని సంక్లిష్టతలని చిత్రీకరిస్తున్నాయి. ఇంద్రగంటి శ్రీకాంత్‌శర్మగారి ముందుమాట ఎంతో అందంగా వుంది. కథాభిమానులందరూ తప్పక చదవతగిన పుస్తకం.

**- డా॥ జి.ఆర్. కృష్ణ**

లలితని అక్కా అని పిలవటం నాకు అలవాటు.

"ఏం చెయ్యమంటావ్?" లలిత అంది. "నా ఆరోగ్యమేమీ బాగోటం లేదు. పైగా చూస్తున్నావా ఇంటిలో హడావిడి ఒక్క నిముషం తీరిక లేదనుకో"

"నిజమే" నేను అన్నాను. "కానీ పెద్దమ్మ నీ కోసం కళ్ళల్లో వత్తులు వేసుకొని ఎదురు చూస్తోంది. ఏదయినా ఒక అదివారమైనా..."

"బలే చెప్పావులే" లలిత అంది. "ఆదివారమూ ఆదివారాలు ఇంట్లో పెళ్ళి, ఒడుగూనూ ఆ రోజేగా మా పిల్లలూ, మనమూ రావటం"

నాకు ఏమనాలో తోచలేదు. మంచం మీద. చలనరహితంగా పడివున్న పెద్దమ్మ గుర్తుకొచ్చింది. కూతురు కోసం వెతికే ఆమె కళ్ళు గుర్తుకొచ్చి నా కళ్ళు చమర్చాయి. కళ్ళు వత్తుకున్నాను. తన కూతురికి కూడా తన కంటూ ఒక అనుబంధాల వలయం ఏర్పడిపోయిందనే విషయం పాపం పెద్మమ్మ మర్చిపోయినట్లుంది.

"నిజమే అక్కా" మాటలు వెతుకుతూ నేను అన్నాను.

"అయినా మీ అమ్మగారు..."

హఠాత్తుగా గట్టిగా వీచింది గాలి. ఆ గాలికి వెలుతురిచ్చిన విద్యుద్దీపాలన్నీ ఒకేసారి ఆరిపోయాయి. లలిత ఇంటిని నింపిన చీకటి నా మనసులోకి కూడా పాకుతుందేమోనని భయం వేసింది నాకు.

"వెళ్ళివస్తానక్కా"

"మంచిది" చీకటిలో నుంచి లలిత గొంతు వినబడింది.

"ఐనా నేనక్కడికొచ్చి చేసేదేముంది. అమ్మ మాట్లాడదు. నా మాట దానికి వినబడదు. ఇంకెందుకు శ్రమ. ఐనా అమ్మని చూడటానికి బంగారమ్మ వుందిగా?"

చీకటిలోనే అడుగులు వేసి ఇంటి బయటికి వచ్చాను. ఒక కొవ్వొత్తయినా వెలిగించలేదు లలిత.

ఇల్లు చేరుకున్నా లలిత మాటలు నన్ను వెంటాడాయి. నిజమే బంగారమ్మ లేకపోతే పెద్దమ్మ ఏమయిపోయేది?

ఆ రోజు నాకింకా బాగా గుర్తు. అప్పుడు పెద్దమ్మ ఇంత నీరసించలేదు. లేచి తిరుగుతూ వుండేది. భర్త పోయిన బాధ, పిల్లలు దగ్గర లేరన్న బాధ పెద్దమ్మని మానసికంగా క్రుంగదీసినా ఓపికగానే తిరుగుతూ వుండేది.

"కొండమ్మని రమ్మను" పెద్దమ్మ అంది. కొండమ్మ పెద్దమ్మకి నమ్మిన బంటు.

ఉదయసూర్యుని వెంటబెట్టుకొని వచ్చింది కొండమ్మ.

"బంగారమ్మ ఏం చేస్తోంది?" పెద్దమ్మని సూటిగా అడిగింది.

"ఏం చేస్తోంది అక్కడా యిక్కడా పనులు చేస్తోంది"

"అక్కడా యిక్కాడా ఎందుకు? నా దగ్గరే వుంచెయ్యి నేను చూసుకుంటాను" కొండమ్మ మారు మాట్లాడలేదు. ఉదయసూర్యుని కిరణాలని వదిలేసి వెళ్ళిపోయింది.

రెండు జడలు వేసుకొని పొట్టి పరికిణీతో పరుగెత్తి పరుగెత్తి పనులు చేసే బంగారమ్మని చూస్తుంటే నాకు ముచ్చట వేసేది, అప్పుడప్పుడూ జాలికూడా కలిగేది.

రెండు జడలు వేసుకొనే బంగారమ్మ మెల మెల్లగా ఒక్క జడకి వచ్చింది. పొట్టి పరికిణీకి బదులుగా పరికిణీ ఓణీ వేసుకోటం మొదలు పెట్టింది.

పెద్దమ్మ ఇంటి గోడకి వేసిన రంగు వెలసిపోయింది. అక్కడక్కడా పెచ్చులు కూడా వూడిపోయాయి. మంచం పట్టేసింది పెద్దమ్మ. బల్లిలా మంచానికి అతుక్కుపోయిన పెద్దమ్మని చూస్తూ వుంటే నాకు బాధ కలుగుతూ వుండేది. దర్జాగా మహారాణిలా బ్రతికినావిడ ఇలా అయిపోయిందేమిటి? పాపం! నిగనిగలాడిన ఆమె శరీరమిప్పుడు అస్థికల గూడుగా మారిపోయింది. చూపు మందగించింది. నడుము వంగింది. కదల లేదు. అంతా మంచం మీదే. అంతా బంగారమ్మ చేతుల మీదే జరగాలి.

అస్సలు విసుక్కునేది కాదు బంగారమ్మ. ఓర్పుతో పెద్దమ్మకి కావాల్సినవన్నీ చేస్తూ వుండేది.

తల్లిని చూడటం కోసం వచ్చే లలిత రాక ఆగిపోయింది.

"అక్కడికి వచ్చి చేసేదేముంది?" లలిత అడుగుతూ వుండేది.

నాకు బాధ కలిగింది. భర్త పోయిన స్త్రీకి పిల్లలున్నా వృద్ధాప్యం ఒక శాపమే అనిపించింది.

"పెద్దమ్మని హైదరాబాద్ తీసికెళ్ళవచ్చు కదరా?" సుబ్బయ్య వచ్చినప్పుడు ఒకసారి అడిగాను.

"తీసికెళ్ళాలనే వుంది" సుబ్బయ్య గట్టిగా నిట్టూర్చి అన్నాడు. "కానీ ఏం చెయ్యనురా? అమ్మను చూడటానికి ఇక్కడైతే బంగారమ్మ వుంది. కానీ అక్కడ" అతను ఒక నిముషం ఆగాడు. ఆ తర్వాత అన్నాడు "ఈ రోజుల్లో ఎవరైనా కాళ్ళు, చేతులూ ఆడుతున్నప్పుడే పోతేనేరా మంచిది."

నా కళ్ళు నిండాయి.

బహుశః నరకమంటే ఆరోగ్యానికి, ఆత్మీయుల పలకరింపులకీ దూరమయిన వృద్ధాప్యమేనా!

"ఏమిటిరా కూర్చుని కునుకు తీస్తున్నావు?" ప్రసాద్ నన్ను భుజం తట్టి లేపాడు. "పదరా లోపలకెళదాం"

కళ్ళు నులుపుకొని లేచాను. షామియానా కింద ఖాళీ కుర్చీలు ప్రాణం ఎగిరిపోయిన శరీరాలలా పడి వున్నాయి.

బరువుగా అడుగులు వేసి లోపలకు వెళ్ళాము. చనిపోయిన పెద్దమ్మ కాళ్ళవద్ద ఒక శిలలా కూర్చుంది బంగారమ్మ. ఏడ్చి ఏడ్చి ఉబ్బుకుపోయిన ఆమె కళ్ళు ఎర్రమందారంలా కనబడ్డాయి నాకు. కళ్ళల్లో నుంచి జారిన కన్నీళ్ళు చిక్కబడి చెక్కిళ్ళలో మరకలు కట్టి వున్నాయి.

"బాబుగారూ అమ్మగోరు..." మమ్మల్ని చూడగానే బోరుమంది బంగారమ్మ.

నా గుండె కదలిపోయింది. పెద్దమ్మకీ, బంగారమ్మకీ ఆరు సంవత్సరాల అనుబంధం. పెద్దమ్మకి ఎంతో సేవ చేసింది బంగారమ్మ. స్వంత తల్లిలా చూసుకుంది. కూతురు కూడా చెయ్యని పనులు చేసింది. ఆమె దుఃఖం అర్థం చేసుకో కలిగాను నేను.

గది అంతా కలియ చూశాను. తుఫాన్ వెలసిన ఆకాశంలా వుంది ఆ గది. పరామర్శకోసం వచ్చిన చుట్టాలు, స్నేహితులు వెళ్ళిపోయారు.

పెద్దమ్మ తల వద్ద కూర్చుని కునుకు తీస్తున్న మా ఆవిడని తట్టి లేపాను. "నిద్ర వస్తుంటే ఇంటికి వెళ్ళి పడుకోరాదూ?"

"వద్దండీ" ఆవులిస్తోంది ఆవిడ. "నేను వెళ్ళిపోతే బంగారమ్మ ఒక్కతీ కూర్చోవాలి. వచ్చిన చుట్టాలందరూ వెళ్ళిపోయారు కదండీ."

"లలిత కూడా వెళ్ళిపోయిందా?"

"ఎప్పుడో. రేపు ఆవిడ తమ్ముడు వచ్చాక వస్తుందట దహనకాండ ముందు."

"నెత్తీ నోరూ బాదుకొని తల్లి శవం మీద పడి ఏడ్చింది కదా. శవం వద్ద వుండవచ్చు కదా?"

"ఆవిడ ఏమని ఏడ్చిందో మీరు విన్నారా?" మా ఆవిడ అడిగింది. "ఆవిడ ఏడుపు తల్లి పోయినందుకు కాదండీ"

"మరి?"


"రాగానే పెద్దమ్మ నగల గురించి అడిగిందండీ"

"ఏం చెప్పావు"

"నిజమే చెప్పాను. పెద్దమ్మ నగలు, బ్యాంకులో వున్న రెండు లక్షల పైచిలుకు డబ్బు బంగారమ్మ పేరు మీద రాశారని చెప్పానండీ"

"అదీ సంగతి! అందువల్లే ఇలా అన్యాయం చేస్తావని అనుకోలేదే అమ్మా' అని నెత్తీ నోరూ బాదుకొని ఏడ్చింది కాబోలు. అంత గట్టిగా ఏడుస్తుంటే ఏది ఏమైనా పోయింది తల్లిగదా అని బాధపడి ఏడుస్తోందని అనుకున్నాను. కానీ ఏడుపు తల్లి పోయినందుకు కాదు. నగలు, డబ్బూ పోయినందుకన్నమాట?"

లోగుట్టు పెరుమాళ్ళుకెరుక! ❋



## ఆత్మీయతానుబంధం

ఆయిరత్తిల్ ఒరువన్ (వెయ్యిమందిలో ఒకడు) తమిళ చిత్రాన్ని ప్రముఖ దర్శకుడు బి.ఆర్. పంతులు నిర్మించి, దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో ఎమ్.జి. రామ చంద్రన్, జయలలిత జంటగా నటించారు. అదే చిత్రంలో విలన్‌గా ఎమ్.ఎన్. నంబియార్ నటించారు. ఆ చిత్రం షూటింగ్ సమయంలో అందరూ కలిసి భోజనానికి కూర్చున్నారు. నంబియార్ ప్రక్కన ఎమ్.జి.ఆర్. కూర్చుని ఎండుచేపల పులుసు కారియర్ తెరవగానే, నంబియార్ భోజనం చేయకుండా లేచారు. ఎమ్.జి.ఆర్ ఎంత చెప్పినా నంబియార్ భోజనం చేయలేదు. అందువల్ల ఆయన (ఎమ్.జి.ఆర్.) ఆ రోజంతా భోజనం చేయలేదు. రాత్రి పది గంటలకు ఎమ్.జి.ఆర్. భోజనం చేయలేదన్న సంగతి నంబియార్‌కు తెలిసింది. వెంటనే నంబియార్ ఎమ్.జి.ఆర్ వున్న గదికి వెళ్ళగా ఆయన పడుకున్నారు. "ఏమిటి యీ మొండి పట్టుదల?" అని అడగగా, అందుకు ఎమ్.జి.ఆర్. 'నీవు భోజనం చేయకుండా లేచిపోయావు, పైగా అందరి ముందూ నన్ను అవమానపరిచావు. అందువల్ల నాకు మనస్సు కష్టమైంది' అన్నారు.

"రేయ్ రామచందూ భోజనం చెయ్యి" అని ప్రేమతో బుజ్జగించి, అన్నం ముద్దలు తినిపించారు నంబియార్.

**- పిళ్ళారిసెట్టి ఆదికేశవరావు**

